నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 28 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL



కడెంలో ఆవుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# నిరసన తెలిపి.. గోమాతకు విన్నవించి

కడెం/దస్తురాబాద్, డిసెంబర్ 27: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలిపి గోమాతకు వినతిపత్రం అందించారు. శుక్రవారం కడెం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఏడో రోజు సమ్మెలో భాగంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన యూనియన్ కార్మికురాలు జిల్లా కార్యదర్శి రాధ మాట్లాడారు. మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వామే కోడి గుడ్లను పంపిణీ చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జిలను పెంచాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలను అందజేయాలని, ప్రతి పాఠశాలకూ గ్యాస్ సిలిండర్ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని, షరతులు లేని రుణాలు అందజేస్తూ కార్మికులకు అండగా ఉండాలన్నారు. దస్తురాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో భాగంగా నిరసన చేపట్టారు.



దస్తురాబాద్ : నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలి

ఎదులాపురం, డిసెంబర్ 27 : అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ డీ.జైత్రాం అన్నారు. శుక్రవారం రిమ్స్‌లో జూనియర్ వైద్యులు, సిబ్బందికి అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. దవాఖానతో పాటు ఇండ్లు, ఇతర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం సంబంధించిన ఏ విధంగా వ్యవహరించాలో ప్రయోగాత్మకంగా చూపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా మంటలను అదుపు చేయడంపై దృష్టి సారించాలన్నారు. పెద్ద ప్రమాదం ఉన్న సమయంలో వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అప్పటివరకు మంటలను అదుపు చేయడంలో ఫైర్ పరికరాలను ఉపయోగించాలన్నారు. దీనిపై అవగాహన ఉంటే నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అగ్నిమాపక శాఖ లీడ్ ఫైర్‌మెన్ గులాం యస్థాని, డ్రైవర్ ఆపరేటర్ ప్రదీప్ సింగ్, ఫైర్ ఆఫీసర్లు రాము, అన్వేష్, మధుకర్, సాయిప్రసాద్, ఫేరోజ్ ఖాన్, పృథ్వీరాజ్, అధికారులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

# రెగ్యులర్ చేయాలి

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్
- ఒంటి కాలిపై నిల్చొని నిరసన

ఎదులాపురం/నిర్మల్ అర్బన్, డిసెంబర్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఎన్టీఆర్ చౌరస్తాలో ఒంటికాలిపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. సమ్మె చేపట్టి 18 రోజులైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించక పోవడంపై సమగ్ర శిక్ష బోధన బోధనేతర సిబ్బందితో పాటు వంట సిబ్బంది విధులను బహిష్కరించి నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలన్నారు. 18 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి రాగానే తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి పడల రవీందర్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరం సింగ్, ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ చిన్నారులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 27 : భారత దేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతిపై శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**తీరని లోటు : మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, డిసెంబర్ 27 : ప్రధానిగా పదేండ్ల పాటు దేశానికి సేవలందించిన మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. అనేక ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపారని, ఆర్థిక వేత్తగా పేరొందారని కొనియాడారు.



ఇంద్రవెల్లిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అఖిల పక్షం నాయకులు

## అకాల వర్షం..తడిసిన పత్తి

బేల/భీంపూర్/బోథ్, డిసెంబర్ 27 : ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి, కంది పంటలు చేతి కొచ్చే సమయంలో అకాల వర్షానికి తడవడంతో రైతన్నలకు నష్టం వాటిల్లింది. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండలంలో పలు గ్రామాలతో పాటు భీంపూర్ మండలంలోని గుబిడి, కొజ్జన్‌గూడ, తదితర గ్రామాల్లో కురిసిన వానకు పత్తి, కంది పంటలు తడిసాయి. బోథ్ మండలంలో వానకు జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో నిల్వ ఉంచిన పత్తి కుప్పలు తడిచిపోయాయి. ఫ్యాక్టరీల యజమానులు, సిబ్బంది, కూలీలు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికే పంటలకు సరైన ధర లేక ఇబ్బంది పడుతుంటే ఈ వర్షంతో చేతికొచ్చిన పత్తి, కంది పంటలు తడిచి తీవ్ర నష్టం జరిగిందని రైతులు వాపోయారు.



వర్షానికి తడిచిన పత్తి పంట

# మత్స్యకారుల ఉపాధికి గండి

**జిల్లాలో చేపల పెంపకంపై నీలినీడలు**

- గతంలో కన్నా 50 శాతం తగ్గించి చేప పిల్లలను విడుదల చేయాలని సర్కారు ఆదేశం
- ఇప్పటి వరకు 560 చెరువుల్లో విడుదల
- ఇంకా 88 చెరువులకు చేరని వైనం
- కేసీఆర్ ప్రభుత్వంలో ఏటా 4.75కోట్లు విడుదల
- ప్రస్తుతం 2.35 కోట్లకే పరిమితం
- తగ్గనున్న మత్స్య సంపద
- ఈ ఏడాది భారీగా నష్టపోతున్న జాలర్లు



చనిపోయిన చేప పిల్లలను చూపుతున్న మత్స్యకారులు

నిర్మల్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న తర్వాత గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు దూరం చేస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఇవ్వకుండా ఆసరా పింఛన్లు పెంచకుండా అటు రైతులను, ఇటు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలను కూడా సక్రమంగా అమ లు చేయక పోవడంతో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. తాజాగా మత్స్యకారుల ఉపాధిపై కూడా దెబ్బ కొట్టే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని వాపోతున్నారు. రాష్ట్రంలో మత్స్య సంపదను పెంచి, మత్స్యకారుల ఉపాధికి బాటలు వేసి వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం వానకాలం సీజన్ లో చెరువులు, ప్రాజెక్టుల్లోకి నీరు చేరగానే కోట్లాది చేపపిల్లలను నీటిలో వదిలా రు. ఇలా నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 648 చెరువుల్లో ఏటా 4.75 కోట్ల చేపపిల్లలను విడుదల చేసి పకడ్బందీగా వాటి పెంపకాన్ని చేపట్టారు. ప్రస్తుత కాం గ్రెస్ ప్రభుత్వం మాత్రం మొదట్లో చేపపిల్లల పంపిణీకి ముందుకు రాలేదు. మ త్స్యకార సంఘాలు చేసిన ఆందోళనలు, జాలర్ల నుంచి వచ్చిన డిమాండ్లతో ఎట్టకేలకు దిగి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన చేప పిల్లల్లో నుంచి 50 శాతం మాత్రమే పంపిణీ చేయాలని ఆదేశించింది. దీంతో ఒక్కసారి గా సగానికి పడిపోవడంతో మత్స్యకారుల ఉపాధికి గండి పడ్డట్లైంది. ఇప్పటి వ రకు జిల్లాలోని 560 చెరువుల్లో దాదాపు 2 కోట్ల పిల్లలను వదిలినట్లు చెబుతున్నారు. ఇంకా 88 చెరువుల్లో 35 లక్షల చేప విత్తనాలను వేయాల్సి ఉన్నప్పటికీ.. ఈ పంపిణీ ప్రక్రియ ఇప్పటికే నిలిచిపోయినట్లు సమాచారం. అంటే 50 శాతం చేప పిల్లలు కూడా ఈ ఏడాది జిల్లాలోని చెరువులకు చేరలేదని తెలుస్తున్నది. ఈ సారి చేప పిల్లల కొనుగోలు, పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా తీవ్ర ఆలస్యమైంది. చేప పిల్లలను పంపిణీ చేసే కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి ధర, నాణ్యత విషయంలో మొండి వైఖరి అవలంబించడంతో ప్రక్రియ మరింత ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో ఈ సారి చేప పిల్లల పెంపకం వ్యవహారం ఇటు అధికారులు, అటు మత్స్యకారులను అయోమయానికి గురి చేసింది.



బీఆర్ఎస్ హయాంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చేపపిల్లలను వదులుతున్న అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి (ఫైల్)

## మత్స్యకారుల ఉపాధిపై ప్రభావం...

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సారి చేప పిల్లల పెంపకం విషయంలో అస్తవ్యస్త విధానాలు అమలు చేయడంతో పిల్లల పంపిణీ ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో చేప పిల్లల పెంపకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆలస్యంగా చేప పిల్లలను వదిలిన కారణంగా చెరువులు, రిజర్వాయర్లలో చేపలు పెరిగేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గిపోయే అవకాశం ఉన్నది. వచ్చే మార్చి నెల నాటికి యాసంగి పంటల సాగుకు ఏకధాటిగా మూడు నెలల పాటు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. దీంతో చెరువులు ఎండిపోయే అవకాశం ఉండడంతో చేప పిల్లల పెంపకంపై తీవ్ర ప్రభావం పడుతుందని మత్స్యకారులు వాపోతున్నారు. ఇదే జరిగితే జిల్లాలోని 22 మత్స్యకార సొసైటీల పరిధిలో ఉన్న 13 వేలకు పైగా మత్స్యకారుల ఉపాధికి గండిపడే అవకాశం ఉంటుంది.

## సైజులోనూ తేడాలు..

ఈ సారి చేప పిల్లలను పంపిణీ చేసేందుకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ప్రభుత్వం నిర్దేశించిన సైజులో కాకుండా చిన్న సైజు చేప పిల్లలను పంపిణీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 80 నుంచి 100 మిల్లీ మీటర్ల సైజు గల లక్ష చేప పిల్లలకు 1.73 లక్షలను ప్రభుత్వం చెల్లిస్తుంది. 35 నుంచి 45 మిల్లీ మీటర్ల సైజు గల లక్ష చేప పిల్లలకు రూ.64వేలను చెల్లిస్తుంది. అయితే చేప పిల్లల పంపిణీ కోసం కాంట్రాక్టు దక్కించుకున్న కొందరు చిన్న సైజు పిల్లలను పంపిణీ చేసి పెద్ద సైజు పిల్లలను పంపిణీ చేసినట్లు లెక్కల్లో చూపినట్లు సమాచారం. పెద్ద సైజు పేరిట చిన్న సైజు చేప పిల్లలను వదిలినట్లు ఆరోపణలున్నాయి. శాశ్వత నీటి వనరులు లభించే చెరువుల్లో 40 శాతం బొచ్చ, 50 శాతం రహు, 10 శాతం మెరిగ రకం చేప పిల్లలను వదులుతారు. సీజన్ చెరువులు..అంటే ఆరు నెలల నుంచి 9 నెలల పాటు నీరు ఉండే చెరువుల్లో 35 మిల్లీ మీటర్ల నుంచి 40 మిల్లీ మీటర్ల సైజు గల చేప పిల్లలను మాత్రమే వదులుతారు. దీంతో ఆయా చెరువుల్లో బొచ్చ రకం 35శాతం, రహు రకం 35 శాతం, బంగారు తీగ 30శాతం నిష్పత్తితో చేప పిల్లలను వదులుతారు. ఈ సారి చేప పిల్లలను వదలడం ఆలస్యం కావడంతో వీటి పెంపకంపై అయోమయం నెలకొన్నది. మొత్తానికి ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ తీవ్ర గందరగోళానికి దారి తీయగా, మత్స్యకారుల ఉపాధిపై కూడా ప్రభావం చూపనున్నదని చెబుతున్నారు.



నిర్మల్‌లోని చేపల మార్కెట్‌లో చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు

# కుమ్రం భీం ఆశయాలను ఐక్యతతో సాధిద్దాం

ఇంద్రవెల్లి, డిసెంబర్ 27 : పోరాట యోధుడు కుమ్రం భీం ఆశయ సాధనకు ఆదివాసులంతా ఐకమత్యంగా కృషి చేయాలని ఆదివాసీ సంఘాల రాష్ట్ర నాయకులు ఆత్రం సుగుణ, కనక తూకారాం, మర్సుకోల తిరుపతి పిలుపునిచ్చారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని ధనోరా(బీ) ఆదివాసీ బిర్దుగోండ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహావిష్కరణకు ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు ఆదివాసీ పెద్దలు, నాయకులు హాజరయ్యారు. ముందుగా ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్రం పోరాట ఫలితంగానే సమాజంలో ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపుతోపాటు ఆదివాసీలకు హక్కులు దక్కాయన్నారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుమ్రం భీం అనేక పోరాటలు చేసి గొప్ప యోధుడుగా నిలిచారన్నారు. కుమ్రం భీంను ఆదర్శంగా తీసుకొని ఆదివాసీ సమాజం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్రం భీం కార్య నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కాత్లే పృథ్వీరాజ్, ఆదివాసీ సంఘాల నాయకులు కోట్నాక్ బారిక్‌రావ్, కొడప నగేశ్, సోయం రాందాస్, ముకాడే ఉత్తం, దూద్‌రాం, గేడం భరత్, జుగ్నాక్ భరత్, కనక హనుమంత్‌రావ్, ఆయా పార్టీలకు చెందిన నాయకులు మెస్రం నాగ్‌నాథ్, జాకేశ్వర్, గేడం సుమన్‌బాయి, గ్రామపెద్దలు మారుతి, జైరాం పాల్గొన్నారు.



ధనోరా(బీ)లో కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

# పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

దస్తురాబాద్, డిసెంబర్27 : గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కార్మిక సంఘం నాయకుడు రాజేందర్ డిమాండ్ చేశాడు. దస్తురాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో సమ్మె చేపట్టినట్లు తెలిపారు. జీవో నం 51 సవరించి అందరికీ వేతనాలను పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



దస్తురాబాద్‌లో మాట్లాడుతున్న పంచాయతీ కార్మికులు

# పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

భైంసా/సోన్, డిసెంబర్, 27 : పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు భైంసా పట్టణంలోని గాంధీ గంజ్ సమీపంలో గాంధీ విగ్రహానికి శుక్రవారం వినతి పత్రం అందించారు. సోన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీల మాజీ సర్పంచ్‌లు గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు లక్ష రూపాయల వరకు ఇస్తామని అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడడం సరికాదని, మొత్తం ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు రాకపోవడంతో రాష్ట్రంలో చాలా మంది సర్పంచ్‌లు చనిపోయినట్లు తెలిపారు. గత నెల 27న పెంబి మండలానికి చెందిన సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ఆర్థిక ఇబ్బందులతో భరించలేక ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని గుర్తు చేశారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలన్నారు. భైంసా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దెగ్లూర్ రాజు, అప్పాల రాకేశ్, రాజేంధర్, రవి గౌడ్, కిష్టయ్య, గనిభాయ్, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, రాంకిషన్ పాల్గొన్నారు. సోన్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తిరుక్కోవెల వినోద్ కుమార్, సుంచు శ్రీనివాస్, బోనగిరి నవీన్, మారి విలాస్, తదితరులు పాల్గొన్నారు.



భైంసా: గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు